## క్లుప్తంగా

### మహిళల ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్

● కలెక్టర్ రాజాబాబు



ఎల్‌హెచ్‌పీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

**ఒంగోలు వన్‌టౌన్:** ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా మహిళల ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. బుధవారం ఆయన చాంబర్‌లో మెప్మా, ఎల్‌హెచ్‌పీ సెల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఒక కుటుంబం పారిశ్రామికంగా ఎదిగేందుకు ఇంటి వద్దే ఆసక్తి గల వ్యాపారాభివృద్ధి కోసం ఆన్‌లైన్ ప్రక్రియ దోహదపడుతుందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మహిళలు ఆసక్తి ఉన్న వ్యాపారానికి ఆన్‌లైన్ ద్వారా ఇంటి నుంచే దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 50 రకాల లైవ్లీ హుడ్ ప్రమోషన్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల రంగం వైపు అడుగు వేసి ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా మహిళలకు జీవనోపాధి మార్గాలను మెరుగుపరచడానికి శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా పీడీ పి.శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

### ఖబరస్థాన్ స్థలాన్ని పరిశీలించిన జేసీ

**ఒంగోలు వన్‌టౌన్:** ఖబరస్థాన్‌కు ఇవ్వనున్న స్థలాన్ని జేసీ గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. ఒంగోలు మండలం కేశవరాజుకుంటలోని ప్రభుత్వ స్థలాన్ని ముస్లింలకు కేటాయించనున్నారు. పరిశీలన కార్యక్రమంలో ఆర్డీఓ, తహసీల్దార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### న్యాయ వ్యవస్థపై మనుస్మృతి దాడి

**చీమకుర్తి:** మనుస్మృతి అమలులో భాగంగానే న్యాయ వ్యవస్థపై దాడి జరిగిందని ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఆర్ఎస్ఎస్‌కు చెందిన న్యాయవాది కాలిబూటుతో దాడి చేసినందుకు బుధవారం చీమకుర్తిలోని పోలీస్ స్టేషన్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం దగ్గర నల్లరిబ్బన్‌లతో ప్రజాసంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. దాడి జరిగి దాదాపు వారం రోజులు గడుస్తున్నా రాష్ట్రపతి, ప్రధాని, హోమ్‌మంత్రి, రాష్ట్రంలోని ప్రధాన పార్టీల నాయకులు ఖండించకపోవడం శోచనీయమన్నారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో కేవీపీఎస్ జిల్లా నాయకులు ఆర్.రాంబాబు, బక్కా రాజు, వేమా బ్రహ్మయ్య, నరసింహారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### అపార్ట్‌మెంట్‌లో ఘర్షణ

**ఒంగోలు టౌన్:** స్థానిక సంతపేటలోని ఓ అపార్ట్‌మెంట్‌లో రెండు వర్గాల మధ్య నెలకొన్న వివాదం ఘర్షణకు దారితీసింది. బాధితుడి కథనం ప్రకారం.. పద్మనాభుని రాధాకృష్ణ కుటుంబంతో కలిసి సంతపేటలోని అపార్ట్‌మెంటులో నివసిస్తున్నాడు. కొంతకాలంగా ఆయనకు - అపార్ట్‌మెంట్ కమిటీకి మధ్య మనస్పర్థలు తలెత్తాయి. దాంతో అపార్ట్‌మెంట్ నిర్వాహకుడు చిట్టి చౌదరి ఆయన పట్ల అమర్యాదగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. దీంతో అపార్ట్‌మెంట్‌లో రెండు గ్రూపులు తయారయ్యాయి. ఈ క్రమంలో మంగళవారం భార్యతో కలిసి బయటకు వెళ్తుండగా ఎదురొచ్చిన చిట్టిచౌదరి బూతులు తిడుతూ రాధాకృష్ణ మీద చేయి చేసుకున్నాడు. మరో వ్యక్తి కూడా తమను బూతులు తిడుతున్నాడని, వారిద్దరి వలన తనకు ప్రాణహాని ఉందని రాధాకృష్ణ స్థానిక టూ టౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

### సుప్రీంకోర్టు సీజేపై దాడి రాజ్యాంగంపై దాడి



నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**ఒంగోలు వన్‌టౌన్:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేయడమంటే భారత రాజ్యాంగంపై, న్యాయ వ్యవస్థపై, ప్రజాస్వామ్య విలువలపై నేరుగా దాడి చేసినట్లేనని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కోటి మాదిగ మాట్లాడుతూ సీజేపై దాడిని ఎమ్మార్పీఎస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. న్యాయ వ్యవస్థ స్వతంత్రతకు ప్రతీకగా నిలిచిన సుప్రీం కోర్టులో సంభవించిన ఈ అవమానకర ఘటన దేశానికే అవమానకరమన్నారు. సనాతన హిందూ ధర్మం పేరిట న్యాయవాది రాకేష్ కిశోర్ సీజేపై బూటు విసరటం న్యాయ వ్యవస్థకు, ప్రజాస్వామ్య చరిత్రకు విచారకరమని అభివర్ణించారు. ఇటువంటి చర్యల వెనుక దేశంలో పెరుగుతున్న మతోన్మాద రాజకీయాలు, కుల ఆధారిత విభజనలను బలపరిచే కాషాయ శక్తులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కొండపి నియోజకవర్గ ఇన్చార్జి రేణుమాల మాధవ్ మాదిగ, రాజు మాదిగ, రావినూతల వెంకటేష్ మాదిగ, గొడపేరు మహేష్ మాదిగ పాల్గొన్నారు.

# పంచాయతీ తీరుపై ప్రజల ఆందోళన

● ఉప్పుగుండూరు పంచాయతీ పాలకవర్గాన్ని రద్దు చేయాలని, అవినీతి జరిగిన సొమ్మును రికవరీ చేయాలని డిమాండ్



పంచాయతీ ఎదురుగా ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

**నాగులుప్పలపాడు:** మండలంలోని మేజరు పంచాయతీ అయిన ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీలోని పాలవర్గం, అధికారుల పనితీరు సక్రమంగా లేదని పార్టీలకతీతంగా గ్రామస్తులంతా ఐక్యంగా బుధవారం పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించాల్సిన పాలకవర్గం.. అసలు సమావేశాలకు హాజరుకాకపోగా, పంచాయతీవైపు కన్నెత్తి కూడా చూడకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇదే తంతు గత మూడు సమావేశాల నుంచి జరుగుతోందన్నారు. దాంతో పాలన కుంటుపడి గ్రామంలో వీధివీధిన పారిశుధ్యం లోపించి దుర్వాసన వెదజల్లుతోందన్నారు. అదేవిధంగా తాగునీటి సరఫరా సక్రమంగా లేదన్నారు. నీరు దుర్వాసన వస్తోందన్నారు. ఒకవైపు ప్రభుత్వాలు స్వచ్ఛత, స్వచ్ఛాంధ్ర అంటూ పదేపదే ఊదరగొడుతున్నప్పటికీ ఉప్పుగుండూరులో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. దాంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడంతో వారు పనులకు రావడం మానివేశారన్నారు. దాంతో గ్రామంలో పారిశుధ్యం పడకవేసిందని, పాలకవర్గం పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాల్సి ఉందన్నారు. అటువంటి విధానం లేనప్పుడు పాలకవర్గం ఎందుకని, రద్దు చేసి ప్రత్యేక అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. అప్పుడైనా పారిశుధ్యం, నీటి నిర్వహణ సక్రమంగా జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. అదేవిధంగా గతంలో పంచాయతీ నిధులు రూ.42 లక్షలు అవినీతి జరిగిందని, రెండు పర్యాయాలు డీఎల్పీఓ పద్మావతి విచారణ చేసి నిర్ధారించి సంవత్సరమైనప్పటికీ ఆ నిధులను రికవరీ చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఆ నిధులను రికవరీ చేసి పంచాయతీకి జమ చేయాలన్నారు. పంచాయతీకి సంబంధించిన రికార్డులు పంచాయతీ వద్ద లేకుండా పోవడం ఏమిటని, ప్రస్తుతమున్న అధికారులను అడగగా తమకు తెలియదని, తాము వచ్చినప్పటి నుంచి తయారు చేసిన రికార్డులు ఉన్నాయని చెప్పడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఎం.బుక్‌లు కూడా లేని పరిస్థితి నెలకొందంటే అధికారులు మారినప్పుడల్లా రికార్డులు మాయవతాయా అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. దాంతో సమాచారం తెలుసుకున్న ఎంపీడీఓ తేళ్ల రవికుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పంచాయతీలో ఏం జరుగుతోందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓకు గ్రామస్తులు అందజేశారు. ఆయన స్పందించి గ్రామస్తులు తెలిపిన అంశాలను డీపీఓ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో తూబాటి శ్రీకాంత్, కాట్రగడ్డ చంద్రబాబు, తెలగతోటి జాన్సన్, కనగాల రామకృష్ణ, గోగినేని రమేష్, శేషగిరి, చంద్రశేఖర్, శేషారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం, విద్యతోనే మానసిక స్థిరత్వం



విద్యార్థులకు సూచనలిస్తున్న మానసిక నిపుణురాలు పెదపూడి గ్రేస్ పుష్పరాగం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మానసిక వైద్య నిపుణుడు అనిల్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శివరాం

మద్దిపాడు:

ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంచి ఆరోగ్యం – మంచి విద్యతో మానసిక స్థిరత్వం అనే అంశంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించగా, మానసిక నిపుణురాలు పెదపూడి గ్రేస్ పుష్పరాగం పాల్గొని మాట్లాడారు. పిల్లలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండే విధానం, వ్యాయామం, ధ్యానం, ఫిజికల్ ఫిట్నెస్ వంటి అంశాల గురించి వివరించారు.

పిల్లల్లో చదువుపట్ల ఆసక్తి కలిగించేందుకు వారితో రోల్ ప్లే యాక్టివిటీస్ చేయించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

#### విద్యార్థులకు మంచి ఆహారం, వ్యాయామం అవసరం

**ఒంగోలు సిటీ:** మానసిక సంఘర్షణల నుంచి బయటపడాలంటే విద్యార్థులకు మంచి ఆహారం, వ్యాయామం, చదువు మీద ఏకాగ్రత ఉండాలని మానసిక వైద్య నిపుణుడు కరవది అనిల్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా ఒంగోలు డీఆర్ఆర్ఎం హైస్కూల్లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 'మంచి ఆరోగ్యం మంచి విద్య' అనే అంశంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ భవిష్యత్తు పట్ల ఆశ, మంచి సమయపాలన, లక్ష్య సాధన ప్రణాళిక, పట్టుదల వంటివి పాటించి భవిష్యత్తులో మంచి విద్యార్థులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ వెంకట్రావు, ఇంగ్లిష్ అధ్యాపకుడు సీహెచ్‌వీ రమణయ్య, బయాలజీ అధ్యాపకులు పీవీ నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

#### మానసిక అనారోగ్యాన్ని దూరం చేసుకోవచ్చు

మానసిక అనారోగ్యాన్ని పాజిటివ్ ఆలోచనల ద్వారా దూరం చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ సి.శివరామ్ అన్నారు. బుధవారం స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాలలో భాగంగా ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఎల్లప్పుడూ పాజిటివ్‌గా ఉంటే మానసిక సమస్యలు దూరం చేసుకోవచ్చన్నారు. విద్యాలయ కౌన్సిలర్ డాక్టర్ పెద్దిగారి లక్ష్మన్న, విద్యాలయ కౌన్సిలర్ కె.త్రివేణి, ఉపాధ్యాయులు కృపారావు, ఉబా రాజు, కిషోర్, అఖిలేసు, మల్లికార్జునరావు, పరస మూర్తి, తాతయ్య, అయ్యన్న, భద్రరావు, సలోమి, విద్యార్థులు పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో మెరుగైన బోధన అందించాలి

● కలెక్టర్ రాజాబాబు



కలెక్టర్ రాజాబాబుకు వివరాలు తెలియజేస్తున్న డీడీ

**ఒంగోలు వన్‌టౌన్:** జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు మెరుగైన బోధన అందించి, ఉన్నతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పీ రాజాబాబు అన్నారు. ఒంగోలు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ పీ రాజాబాబు, సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, ఐసీడీఎస్, మైనారిటీ సంక్షేమ శాఖ, దివ్యాంగుల సంక్షేమ శాఖ తదితర సంక్షేమ శాఖల అధికారులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ విద్యాలయాలతో పాటు, హాస్టళ్లలో ఉన్న మౌలిక సదుపాయాలు, సొంత అద్దె భవనాలు, వాటిని ఉన్నతాధికారులు తనిఖీ చేస్తున్న తీరు, విద్యార్థులకు అందచేస్తున్న ఆహార నాణ్యత, మెనూ అమలు, వసతి గృహాల్లో సమస్యలు, వసతి గృహాల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు తదితర వివరాలను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. పేద విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే వసతి గృహాల ఏర్పాటులో ప్రధాన ఉద్దేశమని, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాస్టళ్లలో ఉంటున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం, వసతితోపాటు వారి ఆరోగ్యంపైనా మరింత దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని మండలంలోని ప్రతి హాస్టల్‌ను ఒక మండల అధికారి దత్తత తీసుకొని పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు హాస్టళ్లను తనిఖీ చేసేలా ట్యాగ్ చేస్తే వారు కూడా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు. హాస్టళ్లలో మరుగుదొడ్ల ఏర్పాటు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు మంచి వాతావరణంలో విద్యార్థులు చదువుకునేలా స్టడీ రూమ్ వంటి ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. హాస్టల్స్‌లో మైనర్, మీడియం పనుల కింద చేపట్టిన పనులను త్వరగా వినూత్నంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్న హాస్టల్స్ భవనాలపై సోలార్ సిస్టం ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు పంపాలన్నారు. హాస్టల్స్‌లోని పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారం అందించేలా వంటవారికి శిక్షణ కార్యక్రమాలు ఇవ్వాలన్నారు. హాస్టల్స్‌లోని ట్యూటర్లను కూడా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ ఎన్ లక్ష్మా నాయక్, బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు సిహెచ్ సువార్త, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి డీ జయ, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ ఈడీలు అర్జున్ నాయక్, వెంకటేశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత



ఆక్వాకల్చర్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రిజిస్ట్రార్ హరిబాబు

**ఒంగోలు సిటీ:** స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం, ట్రైనింగ్ ప్రోగ్రాం పూర్తి చేసుకున్న సెకండియర్ ఎమ్మెస్సీ ఆక్వా కల్చర్ విద్యార్థులకు, అధ్యాపకులకు యూనివర్సిటీ రిజిస్ట్రార్, ఆక్వా కల్చర్ హెడ్ ఆఫ్ ద డిపార్టుమెంట్ ప్రొఫెసర్ బి.హరిబాబు చేతుల మీదుగా బుధవారం సర్టిఫికెట్లు అందించారు. వీరంతా కాకినాడలోని ఐసీఏఆర్-సీఐఎఫ్ఈ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్‌లో సెప్టెంబర్ 22 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించిన ఫీడ్ ప్రిపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్, హేచరీ మేనేజ్‌మెంట్‌పై శిక్షణకు హాజరై మెళకువలు నేర్చుకున్నారు. ఐసీఏఆర్-సీఐఎఫ్ఈ వారు ఎమ్మెస్సీ ఆక్వా కల్చర్ స్టూడెంట్స్ ఎస్.సీ.ఎస్.పి స్కీమ్ కింద అర్హులైనటువంటి విద్యార్థులకు ఉచితంగా శిక్షణకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. 2023-25 సంవత్సరంలో మొదటి సంవత్సరం ఆక్వా కల్చర్ విద్యార్థులు 9 మందికి ఉద్యోగ అవకాశాలు రావడానికి సహాయ సహకారాలు అందించిన రిజిస్ట్రార్ హరిబాబును వీసీ మూర్తి అభినందించారు. కార్యక్రమంలో ఆక్వా కల్చర్ విభాగ అధ్యాపకులైన నారాయణ, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యా వైజ్ఞానిక సదస్సు

**నాగులుప్పలపాడు:** ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నాగులుప్పలపాడు మండల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ విద్యా వైజ్ఞానిక సదస్సు ఏర్పాటు చేసినట్లు ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు షేక్ మౌలాలి తెలిపారు. మద్దిరాలపాడు గ్రామంలో 11వ తేదీ ఏర్పాటు చేసిన ఈ సదస్సులో ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

### రాయల్టీ వసూళ్లలో ప్రైవేటు సంస్థను రద్దు చేయాలి

**చీమకుర్తి:** గ్రానైట్ సీనరేజి వసూళ్లలో ప్రభుత్వం నియమించిన ప్రైవేటు సంస్థ ఏఎంఆర్‌ను రద్దు చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. బుధవారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో ప్రజాసంఘాలతో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సీఐటీయూ, సీపీఎం, రైతు సంఘాల నాయకులు కాలం సుబ్బారావు, పమిడి వెంకట్రావు పాల్గొని మాట్లాడారు. గ్రానైట్ ఫ్యాక్టరీలలో ఒక్కో బ్లేడుకు రూ.35 వేల చొప్పున ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉండగా, దాంతో పాటు అదనంగా మరో రూ.35 వేలు ఏఎంఆర్ సంస్థకు అనధికారికంగా చెల్లించాలని డిమాండ్ చేస్తున్న కారణంగా ఈ నెల 1వ తేదీ నుంచి దాదాపు 1200 గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు సమ్మె చేస్తున్నారని గుర్తు చేశారు. దాని వలన ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని గ్రానైట్ ఫ్యాక్టరీల సమ్మె పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### వాసవీ క్లబ్ నూతన గవర్నర్‌కు సన్మానం



వాసవీ క్లబ్ నూతన గవర్నర్ వేణును సత్కరిస్తున్న సంతనూతలపాడు ప్రతినిధులు

**సంతనూతలపాడు:** 2026 సంవత్సరానికి వాసవీ క్లబ్ నూతన గవర్నర్‌గా ఎంపికైన అమరా వేణును సంతనూతలపాడు వాసవీ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఒంగోలు వాసవీ విద్యా నిధి భవన్లో నిర్వహించిన కార్యక్రమంలో వాసవీ క్లబ్ నూతన గవర్నర్‌గా అమరా వేణు, ప్రధాన కార్యదర్శిగా చలువాది సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా గుర్రం రంగనాథ్, సర్వీసెస్ కార్యదర్శిగా పి.రాజాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారినిగా ఉమా అన్నపూర్ణ వ్యవహరించగా, వాసవీ క్లబ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. వాసవీ క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాదరావు, వాసవీ క్లబ్ జిల్లా ప్రతినిధి గ్రంధి లక్ష్మీప్రసాదరావు, జిల్లా ఆర్యవైశ్య సంఘ సహాయ కార్యదర్శి చక్కా సుబ్బరాయుడు, సంతనూతలపాడు వాసవీ క్లబ్ అధ్యక్షుడు వేమూరి వెంకటశేషారావు, మాజీ అధ్యక్షుడు జి.బద్రీనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జి.శరత్‌బాబు తదితరులు సత్కరించిన వారిలో ఉన్నారు.

# హాస్టల్ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలి



విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జడ్జి

**ఒంగోలు వన్‌టౌన్:** ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులు అభివృద్ధి చెందేందుకు వసతి గృహాల అధికారులు సిబ్బంది కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ సూచించారు. ఒంగోలు నగరంలోని సంతపేటలో ప్రభుత్వ బాలికల వసతి గృహంలో సదుపాయాలను బుధవారం జడ్జి పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సదుపాయాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. పూర్తి సామర్థ్యాన్ని విద్యపై కేంద్రీకరించి ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా మరింత మెరుగైన వసతుల కల్పన కోసం సిబ్బందికి న్యాయమూర్తి సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

# గ్రంథాలయంలో బాపిరాజు జయంతి



బాపిరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది, పాఠకులు

**ఒంగోలు మెట్రో:** స్థానిక జిల్లా గ్రంథాలయంలో బుధవారం బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, నాటకకర్త అడవి బాపిరాజు 130వ జయంతిని ఘనంగా నిర్వహించారు. సంపూర్ణ కాళహస్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ స్టేట్ ఆర్గనైజర్ పొత్తూరి బాలకృష్ణ పాల్గొని బాపిరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఒంగోలు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ మధురశ్రీ, బుచ్చేశ్వరరావు, బంతికట్ల నాగేశ్వరరావురెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయ సిబ్బంది, హిందీ అధ్యాపకురాలు హసీన, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యతోనే అభివృద్ధి

● జేసీ గోపాలకృష్ణ



సన్మానం అందుకుంటున్న ఉత్తమ ఉపాధ్యాయులు

**కొత్తపట్నం:** విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతిఒక్కరూ చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని నెరవేర్చుకోవాలని జేసీ గోపాలకృష్ణ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయిలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలో విద్యాభివృద్ధికి కృషిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ ఉపాధ్యాయ ప్రతిభా పురస్కారాలు అందించారు. ముఖ్య అతిథిగా జేసీ గోపాలకృష్ణ, జిల్లా ఉప విద్యాశాఖాధికారి చంద్రమౌళేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ సివిల్స్‌లో ఆలిండియా స్థాయిలో 3వ ర్యాంక్ సాధించి జాయింట్ కలెక్టర్ అయ్యాయని జేసీ వివరించారు. డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ శాంతకుమారికి చెందిన శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, కొత్తపట్నం శ్రీరామ్ ఎడ్యుకేషన్ సొసైటీ, కొత్తపట్నం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొత్తపట్నం హైస్కూల్, శ్రీవాణి విద్యానికేతన్ స్కూల్‌లోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండల స్థాయిలో వివిధ పాఠశాలల నుంచి ఎంపిక చేసిన ఉపాధ్యాయులు 120 మందిని సత్కరించారు. ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ ఉపాధ్యాయ ప్రతిభా పురస్కారాలు అందించారు. శ్రీరామ్ ఎడ్యుకేషన్ సొసైటీ కరస్పాండెంట్ చాపల కోటేశ్వరరావు, కొత్తపట్నం తహసీల్దార్ కె.శాంతికుమారి, ఎంఈఓ 1, 2 తులసీ కుమారి, పద్మావతి, హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, శ్రీవాణి విద్యానికేతన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ధర్మాచరణతోనే ఇహపర శ్రేయస్సు

**ఒంగోలు మెట్రో:** ధర్మాచరణతోనే మానవుడు భగవంతుని అనుగ్రహానికి పాత్రుడై ఇహపర శ్రేయస్సు పొందగలుగుతాడని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు ఎంవీఎస్ శాస్త్రి అన్నారు. ఒంగోలు దక్షిణం బజారులోని వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. భారత భాగవత రామాయణాలు పరమ పఠనీయ పూజనీయ గ్రంథాలని, వాటిలో చెప్పబడిన మంచి విషయాలను పాటిస్తే మానవులు సకల శుభాలు, శ్రేయస్సు పొందగలుగుతారని వివరించారు. తన భక్తులకు ఎవరి వలనైనా హాని జరిగితే భగవంతుడు పూనుకుని దుష్ట శిక్షణ చేసి భక్తులను కాపాడతాడని వివరించారు. భగవంతునిలోని పరోపకార దృష్టిని మానవులు కూడా ఆదర్శంగా స్వీకరించి భగవంతుని స్ఫూర్తితో ప్రతి ఒక్కరికీ మేలు జరిగేలా చూడాలని కోరారు. భగవంతుని అనుగ్రహానికి పాత్రులైన భక్తుల గాథలను శాస్త్రి సరళ సుందరంగా తెలియజేశారు. కావ్యాలలోని నీతి ప్రబోధకమైన విషయాలను కేవలం చదివి వదిలేస్తే చాలదని, ఆచరణలో వాటిని పాటించినప్పుడే జన్మ ధన్యమవుతుందని, మానవ జన్మ సార్థకమవుతుందని తెలిపారు. రామాయణం, మహాభారతం, మహాభాగవతం వంటి పలు కావ్యాలలోని పాత్రల తీరుతెన్నులను భక్తుల మనసులకు హత్తుకునేలా వివరించారు. వేణుగోపాలస్వామి దేవాలయం అర్చకుడు శ్రీనివాసాచార్యులు, లలిత కళా అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, ఆలయ నిర్వాహకులు మాజేటి వెంకటసుబ్బయ్య, భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.


# మానవతా సేవా సంస్థ సేవలు విస్తరించాలి



రామచంద్రారెడ్డితో మానవతా సేవా సంస్థ సభ్యులు

**ఒంగోలు మెట్రో:** మానవతా సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి బుధవారం మధ్యాహ్నం ఒంగోలు వచ్చిన సందర్భంగా మానవత సేవా సంస్థ ఒంగోలు శాఖ ఆధ్వర్యంలో స్థానిక అంజయ్య రోడ్డులోని బీసీ భవన్లో సభ నిర్వహించారు. మానవతా సేవా సంస్థ చైర్మన్ మారెళ్ల సుబ్బారావు అధ్యక్షత వహించగా, రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మానవతా సేవ సంస్థ కార్యక్రమాలు విస్తరించాలని, సభ్యత్వం నమోదు చేయాలని సూచించారు. మరణించిన వారికి ఉచిత మార్చురీ బాక్సులు సమకూర్చి అంతిమయాత్ర వాహనం కూడా ఉచితంగా ఏర్పాటు చేయాలని కోరారు. మరణించిన పేదలకు మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం అందించాలన్నారు. మానవతా సభ్యులలో అనారోగ్యంతో ఉన్న వారికి వైద్య ఖర్చులకు సహాయపడాలని, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని, పేదలు నివసించే ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా మానవతా సేవా సంస్థ సెంట్రల్ కమిటీ డైరెక్టర్ ఆర్.గోపి, సుబ్బిరెడ్డి, ఒమేగా రామిరెడ్డి, సెంట్రల్ కమిటీ కన్వీనర్ సోమిశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. మానవతా సేవా సంస్థ ఒంగోలు శాఖకు మార్చురీ బాక్సులు అందించి ఆర్థికంగా సహకరించిన కనకదుర్గమ్మ, నాగలక్ష్మి ఇంటికి వెళ్లి రామచంద్రారెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు శరభలింగాచారి, వడ్డేంపూడి సుజాతరావు, మోటుపల్లి వెంకటేశ్వర్లు (చౌదరి), వెంకటరెడ్డి, దన్నారపు మస్తానరావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన బాక్సింగ్ క్రీడాకారులు

**ఒంగోలు:** స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనే జిల్లా బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక బుధవారం స్థానిక గద్దలగుంటలోని పింగళి కోదండరామయ్య ఓరియంటల్ పాఠశాలలో నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో పింగళి కోదండరామయ్య ఓరియంటల్ పాఠశాల విద్యార్థులు 8 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యక్షుడు చలపతిరావు, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి మాట్లాడుతూ శారీరక, మానసిక అభివృద్ధిలో క్రీడలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఎస్‌జీఎఫ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో సైతం రాణించాలని శాప్ బాక్సింగ్ కోచ్ వేణు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ ఒంగోలు మండల కోఆర్డినేటర్ సోమినేని సురేష్, పాఠశాల ఉపాధ్యాయులు ఆనంద్, శ్రీవీరబ్రహ్మం, చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

**ఎస్‌జీఎఫ్ బాక్సింగ్ జిల్లా క్రీడాకారులు:** కె.విష్ణు, బి.వీరాంజనేయులు, ఎం.సుధీర్, ఎం.సాయి, బాలకృష్ణ, శివనాగు, విజయ్‌కుమార్, ప్రిన్స్ అలెక్స్.

### అలరించిన వీణానాదం



వీణానాదం భక్తి కీర్తనలో కళాకారులు

**ఒంగోలు మెట్రో:** స్థానిక కేశవస్వామిపేట లలితాశ్రమంలో బుధవారం ఏర్పాటు చేసిన వీణానాదం భక్తులను విశేషంగా అలరించింది. టీ నాగలక్ష్మి, ఎస్.గీతా ప్రవల్లిక, ఎం.మానసి బృందం వీణల మీద లలితా సహస్రనామం శ్రావ్యంగా వినిపించారు. భక్తి కీర్తనలతో భక్తులను తన్మయపరిచారు. ఆశ్రమ ప్రతినిధి మాతృశ్రీ విజ్ఞానానంద సరస్వతి మాతాజీ, కరవది నాగలక్ష్మి, అప్పారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. గాత్ర విభావరి మరింత ఆకట్టుకుంది.